క్లుప్తంగా

పెండ్లిమర్రి ఎస్‌ఐగా సునీల్ కుమార్

పెండ్లిమర్రి: పెండ్లిమర్రి ఎస్‌ఐగా సునీల్ కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సింహాద్రిపురంలో పని చేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి కడప స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం: మండలంలోని పెద్దచెప్పలి సచివాలయ పరిధిలో మంగళవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ శేషా చలపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన అందులో పేర్కొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం: కమలాపురం క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ బాలాజీ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సీవీ రమణ సోమవారం తెలిపారు. 2023–24 సంవత్సరానికి ఐటీఐలో ఉన్న ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లలో సీట్లు ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు జూన్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన అందులో పేర్కొన్నారు. వివరాలకు 98668 43395 సంప్రదించాలని ఆయన అన్నారు.

లింగాల : లింగాల ప్రభుత్వ ఐటీఐలో 2023–23 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామ్మూర్తి సోమ వారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. తమ కళాశాలలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, సివిల్, డీజి ల్ మెకానిక్, కంప్యూటర్ కోర్సులకు సీట్లు ఖాళీగా ఉన్నాయని.. పదవ తరగతి పాస్, ఇంటర్ పాస్ లేక ఫెయిల్ అయిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చిత్రలేఖనంపై అవగాహన

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని వేంపల్లి రోడ్డులో ఉన్న ప్రభుత్వ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం పిల్లలకు చిత్రలేఖనంపై అవగాహన కార్యక్రమం జరిగిందని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఉమాదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలన్నీ విద్యార్థులలో విజ్ఞానంను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రభుత్వ విశ్రాంతి ఉపాధ్యాయులు జగన్నాథం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారన్నారు.

పిల్లలకు నీతి కథలు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులలో భాగంగా సోమవారం పిల్లలకు రామాయణం, మహాభారతం కథలు చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులు క్యారమ్స్ ఆటలు ఆడించడం జరిగింది. కార్యక్రమంలో లైబ్రేరియన్ శేఖర్, పాఠకులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాణేల ప్రదర్శన

పులివెందుల టౌన్ : పులివెందుల శాఖ గ్రంథాలయంలో సోమవారం కోయంబత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు హరిత, శాంత కుమారిలు విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. అలాగే కడపకు చెందిన రిటైర్డ్ లైబ్రేరియన్ శ్రీరంగనాథ ఏర్పాటు చేసిన వివిధ దేశాలకు చెందిన నాణేలు, కరెన్సీ ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి ,రిటైర్డు ఉపాధ్యాయుడు గంగిరెడ్డి పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

కమలాపురం: విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు పెంపొందించుకోవాలని కమలాపురం శాఖా గ్రంథాలయాధికారిణి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన సదస్సు లో భాగంగా మంగళవారం విద్యార్థులకు ఆమె నీతి కథలు బోధించారు. అనంతరం విద్యార్థులకు డ్యాన్స్‌లో శిక్షణ నిచ్చారు.

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ధర్నా

జమ్మలమడుగు రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వికలాంగులు ధర్నా నిర్వహించారు. సోమవారం వికలాంగులు డాక్టరు లేకపోవడంతో ఆసుపత్రి ఎదురుగా ధర్నా నిర్వహించారు. వికలాంగులు మాట్లాడుతూ నాలుగు వారాలుగా తమకు ఇవ్వవలసిన సదరన్ సర్టిఫికెట్స్ ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని ఆరోపించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చామని తీరా ఆసుపత్రికి వచ్చిన తరువాత డాక్టర్ రాలేదని సిబ్బంది తెలియపరచడంతో ధర్నా చేపట్టామన్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫీక్‌బాషాను వివరణ కోరగా ఆర్థోపెడిక్ డాక్టర్ రామచంద్రారెడ్డి బదిలీపై వెళ్లారని అయితే తిరిగి వారం కిందట రామచంద్రారెడ్డిని తిరిగి జమ్మలమడుగుకు బదిలీ చేశారన్నారు. డాక్టర్ విధుల్లో చేరిన వెంటనే వారికి సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

చింతకొమ్మదిన్నె: మండలంలోని గంగమ్మ తల్లి హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఆలయ ఈవో సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణంలో నిర్వహించిన హుండీ ఆదాయం లెక్కింపులో 48 రోజులకు గాను రూ.2,63,901 లక్షలు వచ్చినట్లు ఈఓ తెలిపారు.

స్పందనతో సమస్యల పరిష్కారం



పులివెందుల రూరల్ : సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశులు



వీరపునాయునిపల్లె: రికార్డులను తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి సాయిగ్రేస్



ఎర్రగుంట్ల : కలమల్ల గ్రామంలో స్పందన కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి వీరబ్రహ్మం

పులివెందుల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించే విధంగా సచివాలయ అడ్మిన్లు, సిబ్బంది పనిచేయాలని ఆర్డీఓ వెంకటేశులు పేర్కొన్నారు. సోమవారం పులివెందుల మండల పరిధిలోని రాగిమానుపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో స్పందన కార్యక్రమాన్ని ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, సీఐ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు అధికారులకు తెలియజేయాలన్నారు. సమస్యలు తెలిపిన వెంటనే వాటిని పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. స్పందన కార్యక్రమానికి అధికారులు తగిన నివేదికలతో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అడ్మిన్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : స్పందనలో ప్రజల నుంచి వస్తున్న అర్జీల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి వీరబ్రహ్మం అన్నారు. సోమవారం కలమల్ల గ్రామంలోని గ్రామ సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్పందనలో ప్రజల నుంచి వస్తున్న అర్జీలను స్వీకరించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్పందన కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయా శాఖ అధికారులు స్పందించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని సచివాలయ అడ్మిన్లు సిబ్బంది పని చేయాలని, దీనికి సంబంధించి వాలంటీర్లు కూడా కృషి చేయాలని తెలియజేశారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు, ఆశా, అంగన్‌వాడీ అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

వీరపునాయునిపల్లె: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన వీరపునాయునిపల్లె సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకాగా సచివాలయ సిబ్బంది ఒక్క వీఆర్వో తప్ప ఎవరూ హాజరు కాలేదు. 10.30గంటలకు ఒకరొక్కరు విధులకు హాజరు కావడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి సాయిగ్రేస్ అధ్యక్షతన స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రతి సోమవారం మండల స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించడం జరిగేదన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రస్తుతం వారంలో రెండు సచివాలయాల పరిధిలో స్పందన కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఆమె తెలిపారు. ఇక మీదట మండల కేంద్రానికి రానవసరం లేదన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జాఫర్ సాదిక్, ఉపాధి ఏపీఓ వెంకటసుబ్బయ్య, మండల అధికారులు పాల్గొన్నారు.

చెన్నూరు : వలంటీర్లు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. చెన్నూరు మండలం కొండపేట సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ సచివాలయాల పరిధిలో 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ప్రభుత్వం నియమించడం జరిగిందన్నారు, దీంతో ఆ ఇళ్లకు సంబంధించిన సమస్యలను ఆ వలంటీర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలన్నారు. అలాగే సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఆయన తెలియజేశారు. జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆయన సూచించారు. లైన్‌మెన్ రమణ సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, ఎంపీడీఓ గంగన్నపల్లి సురేష్‌బాబు మాట్లాడారు. అలాగే మండలంలోని కొండపేట గ్రామ సచివాలయంలో అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బందితో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ రఘురాం రెడ్డి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పంచాయతీరాజ్ ఏఈ మురళి, ఏపీఎం గంగాధర్, మండల అధికారులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ప్రయాసలు పడకుండా తమ గ్రామ సచివాలయాల్లోనే స్పందన కార్యక్రమం నిర్వహించి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తహశీల్దార్ మహబూబ్ బాష, ఎంపీడీఓ కృష్ణమూర్తిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని బలపనూరు గ్రామ సచివాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కసనూరు గ్రామానికి చెందిన ద్వారకనాథరెడ్డి జనన ధ్రువీకరణ పత్రానికి అర్జీ పెట్టుకోవడంతో అప్పటికప్పుడు పాత రికార్డును తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రాన్ని అధికారులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఏపీఎం మంజునాథ, ఆర్ఐ షేక్షా, మండల సర్వేయర్ రాజు, పీఆర్ ఏఈ ఉదయ్‌కుమార్‌రెడ్డి, వీఆర్‌ఓ భార్గవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

46 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 46 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, ఆ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎర్రగుంట్ల ఎస్‌ఐ వెంకట క్రిష్ణయ్య సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. వీయన్‌పల్లి మండలానికి చెందిన సురేంద్రనాథ్‌రెడ్డి, ప్రొద్దుటూరుకు చెందిన మోహన్‌రెడ్డి బయటి నుంచి 46 మద్యం బాటిళ్లు తీసుకుని వచ్చి అక్రమంగా అధిక రేట్లకు అమ్ముకుంటున్నారు. అందిన సమాచారం మేరకు రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానం వచ్చిన ఆ ఇద్దరు వ్యక్తుల వద్ద ఉన్న బ్యాగులు తనిఖీ చేయగా అందులో 46 మద్యం బాటిళ్లు గుర్తించామన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని ఆ ఇద్దరిని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు.

వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి

కడప కార్పొరేషన్: వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్సులు తప్పక తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన మామిళ్లపల్లె, బుగ్గ అగ్రహారం, ఊటుకూరు తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఇందిరానగర్ ప్రజలతో మాట్లాడి పారిశుద్ధ్య పనులు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. ఊటుకూరులో నూతనంగా నిర్మాణాలు చేపట్టే వారు ప్లాన్ తప్పక తీసుకోవాలని తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడటం మన బాధ్యత

ప్రొద్దుటూరు క్రైం : పర్యావరణాన్ని కాపాడటం మనందరి బాధ్యత అని ఫారెస్ట్ రేంజ్ అధికారి హేమాంజలి తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాజంలోని అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు సోమవారం పర్యావరణ పరిరక్షణపై రూపొందించిన లైఫ్ అనే కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. డీఆర్‌ఓ లక్షుమయ్య, ఎఫ్‌బీఓలు జనవిజ్ఞాన సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య

పెండ్లిమర్రి: మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామంలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి వేద పండితుల ఆధ్వర్యంలో ధ్వజారోహణం, మహాపూర్ణాహుతి వంటి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం వైభవంగా జరిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య ప్రారంభించారు. పోటీలు రసవత్తరంగా సాగాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు ఆలయ కార్య నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

– ఉత్సవాల సందర్భంగా వెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ ఛైర్మన్‌ను ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఉసేన్, క్రిష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, బ్రహ్మంరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జమ్మలమడుగు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం జమ్మలమడుగు మండల పరిధిలోని పొన్నతోట సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ గ్రామంలో సరైన విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో విద్యుత్ సమస్య ఉందని, పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వారు వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యపై ఆరాతీశారు. కావలసిన విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో గాలి వీచినప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ స్తంభాలు వచ్చాయని మరో రెండు రోజుల్లో ఏర్పాటుచేస్తామని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

గ్రామంలో అర్హులైన వారందరికీ సంక్షేమపథకాలు అందించాలని వాలంటీర్లకు ఎమ్మెల్యే సూచించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, మండల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శిక్షణతో మెరుగైన బోధన సాధ్యం



మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి



హాజరైన ఉపాధ్యాయులు

వల్లూరు: విద్యా వ్యవస్థలో నాణ్యమైన విద్యా బోధనకు శిక్షణ తప్పనిసరి అని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన వల్లూరు లోని ఏపీ మోడల్ స్కూల్‌లో డీఎస్సీ 1998, 2008, 2018 ద్వారా నియామకమైన జీవ శాస్త్ర ఉపాధ్యాయులకు జరుగుతున్న ప్రేరణ ఇండక్షన్ ప్రోగ్రాంకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు శిక్షణలోని అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని పాఠశాలల్లో చేసే బోధనల్లో చక్కగా అన్వయించి విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. జీవశాస్త్ర ప్రాముఖ్యతను, బోధన మెలకువల్ని, మూల్యాంక విధానాన్ని తదితర అంశాలపై పట్టు సాధించి విద్యా బోధనలో వినియోగించాలన్నారు. ఏపీ మోడల్ స్కూల్ అసిస్టెంట్ డైరెక్టర్ దేవరాజు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర చాలా గొప్పదన్నారు. అందరూ ఇలాంటి మంచి శిక్షణ తీసుకుని విద్యార్థులలో నూతన పోకడల్ని సృష్టించి ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. కడప ఉప విద్యాధికారి రాజగోపాల్ రెడ్డి, ధనలక్ష్మీ, రీసోర్స్ పర్సన్ విజయ్ కుమార్, గాయత్రి, ప్రేమానందరెడ్డి, శివరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కడప, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల నుంచి వచ్చిన బయాలజీ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోకేష్ వెయ్యి రోజులు పాదయాత్ర చేసినా ఫలితముండదు

కడప సెవెన్‌రోడ్స్ : యువగళం పేరుతో లోకేష్ వెయ్యి రోజులు పాదయాత్ర చేసినా అధికారంలోకి రావడం కల్ల అని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ప్రొద్దుటూరు అభివృద్ధిపై కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్‌లతో చర్చించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. పాదయాత్ర ప్రధాన ఉద్దేశ్యం ఏమిటో చెప్పాలని తొలుతే తాను ప్రశ్నించానన్నారు. కేవలం చంద్రబాబు ముఖ్యమంత్రిని చేయాలన్న తపన మినహా పాదయాత్రకు మరో ఉద్దేశ్యం ఏదీ లేదన్నారు. ప్రజల్లోకి వచ్చి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. 2014–19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తమ ప్రొద్దుటూరు నియోజకవర్గానికి రూ. లక్ష కూడా కేటాయించలేదన్నారు. ఆయన చేసిన ఎన్నికల వాగ్దానాల్లో ఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు. అర్హులైన పేదలకు ఇళ్లు, నిరుద్యోగ భృతి ప్రొద్దుటూరులో ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. దోమకాటు వల్ల విష జ్వరాలు ప్రబలి ఎంతో మంది మృతి చెందుతున్నారని, డ్రైనేజీ పనులకు రూ. 150 కోట్లు అడిగినా చంద్రబాబు ఒక్క పైసా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక తన నియోజకవర్గంలో రూ. 160 కోట్లు డ్వాక్రా రుణం మాఫీ చేసిన ఘనత జగన్‌దేనన్నారు. ప్రొద్దుటూరులో అర్హులైన పేదలకు 24 వేల ఇళ్లు మంజూరు చేశారన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భవన నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రాష్ట్రంలో 22 లక్షల మంది కార్మికులను నమోదు చేయించారని పేర్కొన్నారు. సంక్షేమ కార్డుల ద్వారా ఫలాలు అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వం వాడుకున్న రూ. 1600 కోట్లు వెంటనే సంక్షేమ బోర్డులో జమ చేయాలని కోరారు. ఇప్పటివరకు 32 వేల పైబడి క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండడం వల్ల కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లకు సంబంధించిన నిధులు వెంటనే మంజూరు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ సంక్షేమ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, జిల్లాప్రధాన కార్యదర్శి మద్దిలేటి, నాయకులు నాగిరెడ్డి, రామాంజనేయులు, బాలాజీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌సీలో జిల్లావాసి ప్రతిభ

– శివాలపల్లె వాసికి కస్టమ్స్ ఎగ్జామినర్ ఉద్యోగం



ముమ్మడి రవితేజరెడ్డి

కడప ఎడ్యుకేషన్: కష్టపడితే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని నిరూపించాడీ కుర్రాడు. అనుకున్న లక్ష్యం కోసం అహర్నిశలు కష్టపడి చదివి చివరకు అనుకున్న ఉద్యోగం సాధించి భేష్ అనిపించుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. చెన్నూరు మండలం శివాలపల్లెకు చెందిన రైతు ముమ్మడి భాస్కర్‌రెడ్డి, లక్ష్మీకాంతమ్మల కుమారుడు ముమ్మడి రవితేజరెడ్డి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలో తన సత్తా చాటి జాతీయస్థాయిలో 3623 ర్యాంకు సాధించి కస్టమ్స్ ఎగ్జామినర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ అబ్బాయి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షకు సంబంధించి మొదటి ప్రయత్నంలో పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించాడు. దాంతో తృప్తి పడలేదు. మళ్లీ రెండు, మూడోసారి రాసినా అనుకున్న పోస్టు రాలేదు. విక్రమార్కుడిగా నాలుగ ప్రయత్నం చేసి అనుకున్న కొలువును సాధించాడు. ప్రస్తుత స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఫలితాల్లో ర్యాంకు సాధించి కస్టమ్స్ ఎగ్జామినర్‌గా ఉద్యోగాన్ని సాధించాడు.

మట్కా బీటర్ల అరెస్ట్

కడప అర్బన్: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మేకల దొడ్డి సమీపంలో ముగ్గురు మట్కా బీటర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 3 వేలు నగదును, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జయరాములు తెలియజేశారు.

- వ్యక్తిపై సెల్‌ఫోన్‌తో దాడి

కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పూసల వీధిలో ఉంటున్న పసల శ్రీనివాసులు, ఓ యువతిని కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడు. అతని తోడల్లుడు షేక్ షఫీ మద్యం సేవిస్తూ రోజూ తన భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో షఫీ భార్య ఈనెల 14న తన చెల్లెలింటికొచ్చింది. అదే సమయానికి షఫీ అక్కడికెళ్లి ఆమెపై దాడికి యత్నించాడు. పసల శ్రీనివాసులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా... షఫీ సెల్‌ఫోన్‌తో దాడి చేశాడు. దీంతో శ్రీనివాసులు నుదురుపై రక్తగాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రంగస్వామి తెలిపారు.

- యువకులకు కౌన్సెలింగ్

కడప టూటౌన్ ఎస్‌ఐ యు.వై జయరాములు సోమవారం సాయంత్రం యువకులకు, వాహనదారులకు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. ద్విచక్ర వాహనాలకు కాలుష్య ప్రమాణాలకు నిబంధనలు ఉల్లంఘించి బుల్లెట్ వాహనాల సైలెన్సర్‌లు మార్చి నడుపుతున్న వారికి జరిమానా విధించారు. బైక్‌ల సైలెన్సర్‌లను తీసేసి, శబ్దకాలుష్యానికి గురి చేసే ఇతర సైలెన్సర్‌లను వాడితే బైక్ సీజ్ చేస్తామనీ ఎస్‌ఐ హెచ్చరించారు.

ఉప్పలూరులో బండలాగుడు పోటీలు

కాశినాయన : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి తిరునాల సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో 10 జతల వృషభాలు పాల్గొన్నాయి. కాశినాయన మండలం ఆనంవారిపల్లె గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి వృషభాలు మొదటి బహుమతి రూ.లక్ష, ప్రకాశం జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వెంకటస్వామి వృషభాలు రెండవ బహుమతి రూ.70 వేలు, అదే గ్రామానికి చెందిన మునీశ్వరయ్య వృషభాలు మూడవ బహుమతి రూ.40 వేలు, నరసాపురం గ్రామానికి చెందిన వెంకటప్రతాప్‌రెడ్డి వృషభాలు నాల్గవ బహుమతి రూ.20 వేలు, పాల్గొన్న ప్రతి వృషభాలకు ఒక్కొక్క జతకు రూ.5 వేలు చొప్పున యజమానులకు అందజేశారు.

వైభవంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని నాగులచెరువు కట్ట వద్ద వెలసిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా సోమవారం నిర్వహించిన ఆంజనేయ స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, ఆకుపూజతో పాటు సింధూర అర్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి సాయంత్రం నుండి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

గ్రామోత్సవం వెంబడి ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సన్నిబోయినసుబ్బరాయుడుయాదవ్, వైస్‌ప్రెసిడెంట్ చెన్నయ్య, సెక్రటరీ డి.వెంకటరమణ, ట్రెజరర్ దూళ్ళరమేష్ తదితరులు పాల్గొన్నారు.